'మీ పెళ్ళిచూపుల గురించి సరోజకి వివరంగా చెప్పారుకదా..... అయినా ఆమెకి మీమీద అనుమానం పోలేదా?......'

రాంబాబు మౌనంగానే ఉన్నాడు. వంచిన తల ఎత్తలేదు.

'అన్నట్టు నాగరాజు సుబ్బలక్ష్మితో ఉన్న ఫోటో ఇప్పుడే మీ నాన్న గారికి పోస్టుచేశానండీ గురూగారూ.....'

దీనికీ సమాధానం చెప్పలేదు రాంబాబు.

రాంబాబుని డిస్టర్బ్ చెయ్యకూడదనిపించింది కిష్టయ్యకి. కాస్సేపు మౌనంగా తనపని చూసుకున్నాడు.

రాంబాబు హఠాత్తుగా లేచి నిలబడ్డాడు.

'ఇప్పుడే వస్తాను.....' అని కిష్టయ్యతో చెప్పి పక్కనున్న ఫాన్సీ షాపుకెళ్ళి సరోజకి ఫోన్‌చేశాడు రాంబాబు.

'హలో .....' అంది అవతలనుండి సరోజ కంఠం.

'హలో....నేనే సరోజా....'

రాంబాబు గొంతు వింటూనే సరోజ ఫోన్ డిస్‌కనెక్ట్ చేసేసింది.

రాంబాబు మనస్సు చివుక్కుమంది.

మరోసారి నెంబర్ డయల్ చేశాడు.

'హలో.....' మళ్ళీ సరోజ రిసీవ్ చేసుకుంది ఫోన్.

'సరోజా..... ప్లీజ్..... నామాట విను. ఫోన్ డిస్‌కనెక్టు చేయకు!' రాంబాబు బ్రతిమాలాడు.

'సారీ ..... ఇంక ఏ విధంగానూ నన్ను కన్విన్స్ చేయలేవు. నీ పెళ్ళి చూపుల గురించి నాకు తెలీగానే దానికో కథ చెప్పావు. నీ శృంగారకేళిని తెలియజేసే ఫోటో గురించి మరో కథ చెప్తావ్.... నేనేమి వినదలచుకోలేదు. ఈ జన్మలో నీతో నేను కలవడం అన్నది జరగదు'

సరోజ ఫోన్ కట్‌చేసింది.

రాంబాబు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ స్టూడియోకి వచ్చాడు.

'కిష్టయ్యా..... ఇంకలే..... స్టూడియో కట్టేసి వెళ్ళిపోదాం' అన్నాడు మెల్లగా.

'అప్పుడేనా? ఇప్పుడు టైం ఏడున్నరే అయింది' అన్నాడు కిష్టయ్య.

'నాకు మనసేం బాగోలేదు....'

ఇద్దరూ స్టూడియో కట్టేసి ఇంటికి బయలుదేరారు. దారిలో ఎవరూ మాట్లాడలేదు.

అదేంటి గురూగారూ పడుకున్నారు. భోంచెయ్యరా?' అడిగాడు కిష్టయ్య.

'నాకాకలిగా లేదు.... నువ్వు తిను.....'

కిష్టయ్య జాలిగా రాంబాబువంక చూశాడు.

"అసలేమయ్యింది గురూగారు? నాతో చెప్పకూడదా? మీ బాధలో నేను పాలుపంచుకో

కూడదా? నాకు చెపితే నా చేతనయిన సహాయం నేను చేస్తాను కదా?'

'నువ్వేమీ చెయ్యలేవురా కిష్టయ్య.... పరిస్థితి పూర్తిగా విషమించిపోయింది. సరోజ నాకు దూరం అయిపోయింది....' దిగులుగా అన్నడు రాంబాబు.

'అసలేం జరిగిందో చెప్పండి.....'

'ఎంతపని జరిగింది గురూగారు..... దీనికి ఏదైనా ఉపాయం ఆలోచించాల్సిందే.....'

రాంబాబు భోజనం చెయ్యకుండా పడుకున్నాడు. గురూగారి పరిస్థితిని చూసిన కిష్టయ్యకీ భోజనం చెయ్యబుద్ధి కాలేదు. కిష్టయ్య కూడా అలాగే పడుకుండిపోయాడు.

అక్కడ సరోజ పరిస్థితి కూడా అలానే వుంది. ఏడ్చి ఏడ్చి పడుకుంది ఆమె.

తెల్లారింది.

రాంబాబు, కిష్టయ్య మొహాలు కడుక్కుని స్నానాలు చేశారు. కిష్టయ్య స్టౌమీద కాఫీచేసి రాంబాబుకో కప్పు ఇచ్చి తనో కప్పు తీసుకున్నాడు.

రాంబబు కళ్ళు ఎర్రగా .... రాత్రి నిద్రపోలేదని చెపుతున్నాయి. ముఖం కూడా బాగా పీక్కుపోయింది.

కాఫీ తాగిన రాంబాబు ఏదో నిర్ణయం తీసుకున్నవాడిలా చటుక్కున లేచి నిలబడ్డాడు.

సూట్‌కేసులోంచి నల్లపాంటు నల్లషర్టు వేసుకున్నాడు.

'నల్లప్యాంటు మీదికి తెల్లషర్టు అయితే బాగుంటుంది గురూగారు.....' అన్నాడు కిష్టయ్య.

'నీకు తెలీదు లేరా.....' అన్నాడు రాంబాబు. అద్దం ఇలాతే.

కిష్టయ్య రాంబాబుకి అద్దం ధ్లువ్వేనా ఇచ్చాడు.

'ఇదివద్దులే.....' దువ్వెన కిష్టయ్య చేతికే ఇచ్చేశాడు.

ఒకసారి అద్దంలో ముఖం చూసుకుని జుట్టుని బాగా రేపేసుకున్నాడు.

'కిష్టయ్యా..... ఒకసారి దగ్గరగా రారా.....'

కిష్టయ్య భయంభయంగా రాంబాబు దగ్గరికి వచ్చాడు. రాంబాబు కిష్టయ్యని గట్టిగా కౌగిలించుకుని ఒళ్ళంతా నిమిరాడు. ఆ తరువాత ఒకసారి నొసలుమీద ముద్దుపెట్టుకున్నాడు.

'వస్తానురా.....' చెప్పుల్లో కాళ్ళు దూరుస్తూ అన్నాడు రాంబాబు.

'ఎక్కడికి వెళ్తున్నారు గురూగారూ?'

'తరువాత చెప్తాను.... వస్తాను.....' మరోసారి కిష్టయ్య నొసలు మీద ముద్దుపెట్టుకుని బయటికి వెళ్ళాడు రాంబాబు.

రాంబాబు వెళ్ళిన పావుగంటదాకా కిష్టయ్య రాంబాబు ప్రవర్తన గురించే ఆలోచించాడు.

నల్లచొక్కా, నల్లప్యాంటూ వేసుకున్నాడు.......జుట్టు రేపుకున్నాడు..... కౌగిలించుకుని ఒళ్ళంతా నిమిరాడు. ముద్దుపెట్టుకున్నాడు.

కిష్టయ్యకు ఏదో అర్థం అయ్యినట్టనిపించింది.

'గురూగారూ!.....' ఒక్కసారిగా బాధగా అరిచాడు కిష్టయ్య.

## ఫ్రేమ్ - 22

కిష్టయ్యకి మతి మతిలోలేదు.

కాస్సేపు కంగారుగా గదిలో ఇటూ అటూపచార్లు చేశాడు.

సందేహం లేదు.... గురూగారూ ఆత్మహత్య చేస్కోడానికే వెళ్ళారు. ఆయన్ని ఎలాగైనా ఆపాలి!!..... కానీ ఎలా? ఎక్కడికి వెళ్లారో ఎలా తెలుసుకోడం?

రైలుపట్టాలా? కొండెక్కి కిందకి నదిలో దూకడమా? కిర్సనాయిలా? నల్లులమందా?

ఏది? ఏది? ఏది?

కిష్టయ్య బాధగా జుట్టుపీక్కున్నాడు.

అంతలోనే కిష్టయ్యకి ఒక ఆలోచన స్ఫురించింది.

చనిపోయేముందు ఓసారి సరోజని కలసి వెళ్తారేమో?!

అంతే ..... కిష్టయ్య రాంబాబు ఎడ్రసుల పుస్తకం తీసి అందులో సరోజ ఇంటి ఎడ్రసు వెతికి పట్టుకుని సరోజ ఇంటికి పరుగుతీసాడు.

### నాగరాజు వ్యూహం

నాగరాజు మనసు ఆనందంతో ఉరకలు వేస్తుంది.

రాంబాబు పెళ్ళిచూపులు వార్త విన్నతరువాత సరోజ రాంబాబు మీద ఆశ వదులుకునే ఉటుంది. కొన్నాళ్లకి మెల్లగా సరోజ తనదై పోయింది.

నాగరాజుకి ఉత్సాహం పుట్టి యాక్సిలటర్ రైజ్చేశాడు. రాజ్దూత్ రివ్వున ముందుకు దుకింది.

ఒక అయిదు నిముషాల్లో రాజ్దూత్ సరోజ ఇంటిముందు ఆగింది.

నాగరాజుకి గుమ్మంలోనే రామయ్య ఎదురయ్యాడు.

'రండి బాబూ రండి.... లోపలికి వచ్చెండి..... ప్లీజ్ బాబు.... లోపలికి రావాలి బాబు.....' సాదరంగా ఆహ్వానించాడు రామయ్య.

'మావయ్య ఉన్నాడా?' అడిగాడు నాగరాజు.

'లేరు బాబు....బజారువెళ్ళారు బాబూ..... అబ్బాయిగారేమోవ్యాయామశాలకి వెళ్లారు బాబు......మీరు లోపలకి రండి బాబు...... కాళ్ళు లాగుతాయి బాబు....'

నాగరాజు హాల్లోకి అడుగుపెట్టాడు.

'కూర్చోండి బాబు కాళ్ళు లాగుతాయి'

'సరోజ ఉందా?'

'ముందు కూర్చొండి బాబూ కాళ్ళు లాగుతాయి'

నాగరాజు రామయ్యవంక విసుగ్గాచూసి కూర్చున్నాడు.

'సరోజ ఉందా?' అడిగాడు.

'ముందు మీకు కాఫీ కావాలో బోర్నవీటా కావాలో చెప్పండి బాబు.....'

'నాకేమీ వద్దు.... సరోజ ఇంట్లో ఉందా?'

'వద్దంటే కుదర్దు బాబూ .... ఈ ఇంటికొచ్చినోళ్ళు ఏదో ఒకటి తీస్కోవాల్సిందే బాబూ....... కాఫీయా, టీయా బోర్నవిటానా బాబూ?'

నాగరాజు బాధ భరించలేక జుట్టు పీక్కున్నాడు.

రామయ్య కంగారు పడ్డాడు.

'తప్పు బాబు..... అల జుట్టు పీక్కోకూడదు బాబు..... తలనొప్పి వస్తుంది బాబూ...... క్రాపు చెరిగిపోయింది దువ్వెన ఇమ్మంటారా బాబూ?'

'సరోజ ఉందా?' నాగరాజు అసహనంగా అడిగాడు.

'తప్పు బాబు..... అమ్మాయిగారు మీ క్రాపు దువ్వడం మంచిది కాదు బాబూ..... అవన్నీ పెళ్ళయ్యాక చేస్కుంటే బాగుంటుంది బాబూ ..... ఇప్పుడు మీ క్రాపు మీరే దువ్వుకోవాలి బాబూ.....'

'ఊహూ.....' బాధగా ఓ మూలుగు మూలిగి గుప్పిటితో జుట్టు పీక్కున్నాడు నాగరాజు.

'క్రాపు మరీ ఇదిగా చెరిగిపోయించి ..... పెద్దదువ్వెన తెమ్మంటారా బాబు.....' రామయ్య వినయంగా అడిగాడు.

నాగరాజు సోఫాలోంచి సర్రున లేచాడు.

'ఇలాగైతే నేవెళ్ళిపోతానంతే ..... సరోజ ఇంట్లో లేదా?' అన్నాడు విసుగ్గా.

రామయ్య బాధపడ్డాడు.

'మీకు విసుగు పుట్టిస్తే క్షమించండి బాబు..... సరోజమ్మగారు ఆరిగదిలోనే ఉన్నారండి బాబూ...... అలా వెళ్లండి బాబు.....'

నాగరాజు పెద్దపెద్ద అంగలేసుకుంటు సరోజ గదిలోకి వెళ్ళాడు.

గదిలో సరోజ లేదు. మంచం మీద దుప్పటి అస్తవ్యస్తంగా వుంది.

బాత్రూములోంచి నీళ్ళ శబ్దం వినిపిస్తుంది..

'సరోజ స్నానం చేస్తున్నట్టుంది' అనుకున్నాడు నాగరాజు.

అక్కడే వున్న కుర్చీలో కూర్చున్నడు.

సరిగ్గా అప్పుడే నాగరాజు దృష్టి మంచం పక్కనే నేలమీద పడి వున్న ఆ ఫోటోమీద పడింది.

నాగరాజు కౌగిలిలో కళ్ళు మూసుకుని ఎవరో అమ్మాయి??

ఎక్కడ చూశానబ్బా?!

కొద్దిక్షణాలు ఆలోచించాడు నాగరాజు.

అతనికి గుర్తుకొచ్చింది.

ఆ మధ్య నీలిమ హత్యకేసు గురించిన వార్త అన్ని పేపర్లలో ప్రముఖంగా వచ్చింది..... ఈ అమ్మాయి ఫోటోని ఆ వార్తతోబాటు ప్రచురించారు.

నాగరాజు మెదడులో మెరుపు మెరిసింది.

సంతోషంతో సన్నగా ఈలవేసి ఫోటోని చొక్కా పై జేబులో పెట్టుకున్నాడు నాగరాజు.

ఈ దెబ్బతో నీ పని క్లోజ్ రాంబాబు.

కసిగా నవ్వుకున్నాడు నాగరాజు.

బాత్రూములో కొళాయినుండి నీళ్ళు పడుతున్నశబ్దం ఇంకా వస్తుంది.

నాగరాజు పిల్లిలా అడుగులు వేస్కుంటూ గది బయటికి వచ్చేసాడు.

'వెళ్ళిపోతారా బాబూ?..... కాస్త కాఫితాగి వెళ్లండి బాబూ......' అంటూ రామయ్యా వెంటపడ్డాడు.

'వద్దులే.....' అన్నాడు నాగరాజు అడుగులు ముందుకు వేస్తూ.

'పోనీ టీగానీ బోర్నవీటా గానీ తాగుబాబూ' వదల్లేదు రామయ్యా.

నాగరాజేమీ మాట్లాడలేదు. గబగబా వెళ్ళి రాజ్‌దూత్‌మీద కూర్చుని స్టార్ట్ జేసి ముందుకు పరుగెత్తించాడు.

'బాబు...... ఏం తీసుకోకుండా వెళ్ళకూడదు బాబు ..... ప్లీజ్ బాబు..... రండి బాబు....'

రామయ్యా వెనకనుండి అరుస్తున్నా వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు నాగరాజు.

నాగరాజు వెళ్ళిన అయిదు నిముషాలకి కిష్టయ్యా వచ్చాడు.

'రా బాబు రా...... ఎవరు కావాలి బాబూ?' అడిగాడు రామయ్యా.

'సరోజగారున్నారా?.....' వగరుస్తూ అడిగాడు కిష్టయ్యా.

'ఉన్నారు బాబు..... ఆ గదిలో వున్నారు బాబూ.....కాఫీ తాగుతావా బాబూ?'

రామయ్యా మాటలు వినేస్థితిలో లేడు కిష్టయ్యా. పరుగున సరోజ గదిలోకి వెళ్లాడు.

***మబ్బులే తొలగెనులే***

అప్పుడే తలకి స్నానం చేసి వచ్చిన సరోజ జుట్టు ఆరబెట్టుకుంది. గదిలో అలికిడి విని తలతిప్పి చూసిన సరోజకి కిష్టయ్యా కనిపించాడు.

'ఏం ?..... మీ గురూగారు రాయబారానికి పంపించారా నిన్ను' కనుబొమలు చిట్లిస్తూ ఆడిగింది సరోజ. బాగా ఉబ్బిన ఆమె కళ్ళు ఏడ్చినట్టు చెపుతున్నాయి.

కిష్టయ్యా అయోమయంగా సరోజవంక చూశాడు.

'అయితే గురూగారు ఇక్కడికి రాలేదా?'

'ఏ ముఖం పెట్టుకుని వస్తారు?'

'మీరు చాలా పొరపాటు పడుతున్నారండీ సరోజగారు. గురూగారు మీరనుకునేలాంటి

మనిషి కారండి.....' అంటూ నీలిమ ఫోటో స్టూడియోకి రావడం కెమేరా ఎడ్జెస్టుమెంట్ల గురించి అడగడం సెల్ఫ్ టైమర్ పెట్టి కళ్ళు తిరిగి పడిపోతుండగా రాంబాబు ఆమెని పట్టుకోవడం అప్పుడు కెమేరా క్లిక్ మనడం అన్నీ వివరంగా చెప్పాడు కిష్టయ్య.

'సరే..... పోనీ మీరనుకున్నట్టుగానే నీలిమకి గురూగారికి సంబంధం ఉందనే అనుకుందాం...... అలాంటప్పుడు వాళ్ళు గది తలుపులు మూస్కుని ఉంటారుగానీ..... ఇలా ఓపెన్‌గా అదీ ఒక కెమేరాకి ఫోజుపెట్టి కౌగిలించుకుంటారాండీ?'

సరోజ కళ్ళు సంతోషంతో వెలిగాయి?!

అన్నట్టు ఈ విషయమే తనకి ఎందుకు తట్టలేదు?!

'నిజం, కిష్టయ్య పాపం ఆయన్ని అనవసరంగా అనుమానించాను..... ఆయన్ని క్షమాపణలు అడగాలి!' అంది సరోజ.

'ఇంకెక్కడి గురూగారండీ...... ఆయన ఆత్మహత్య చేస్కోడానికి వెళ్లారండి సరోజగారు' ఘొల్లుమన్నాడు కిష్టయ్య.

'నీకెలా తెలుసు?' కంగారుగా అడిగింది సరోజ.

కిష్టయ్య రాంబాబు ప్రవర్తన గురించి వివరంగా చెప్పాడు.

'పద...... మనం వెంటనే పోలీసు సహాయం తీస్కోవాలి.....' గబగ్బా జడ అల్లుకుంటూ అంది సరోజ.

అప్పుడే అక్కడికి రామయ్య వచ్చాడు.

'బయటికి వెళుతున్నారా అమ్మా! కాస్త కాఫీయో టీయో తాగి వెళ్ళండమ్మా.....ప్లీజ్ అమ్మా......'

'లేదులే రామయ్యా..... ఇప్పుడు టైం లేదులే.....' అంది సరోజ మొహానికి పౌడర్ పూసుకుంటూ.

'అదేంటోనమ్మా కాఫీ ఇస్తానంటే అందరూ వద్దంటారు..... ఇందాక నాగరాజుగారు కూడా ఏమీ తీస్కోకుండా వెళ్ళిపోయారు.

సరోజ ఆశ్చర్యంగా రామయ్య వంక చూసింది.

'బావ వచ్చాడా? ఎప్పుడు?'

'అదేమంటమ్మా..... ఇందాక మీ గదిలోకి వచ్చారుగా?' ఇంకా ఆశ్చర్యంగా చూస్తూ అన్నాడు రామయ్య.

తన గదిలోకి వచ్చి తనని కలవకుండా వెళ్ళిపోయాడా?!

సరోజకి ఏదో అనుమానం వచ్చింది.

గదిలో రాంబాబు నీలిమల ఫోటో కోసం చూసింది. ఆ ఫోటో కనబడలేదు. రాత్రి తను ఆ ఫోటో చూస్తూ ఏడ్చి అలానే ఏ అర్ధరాత్రో ఎప్పుడో పడుకుంది. మళ్ళీ ఇందాకే లేచింది.